నేటి కందం- నేటికి అందం

మానిత అస్సామున వై
మానిక విన్యాసములను మహిత పథములో
ప్రాణములను పణ మొడ్డుచు
ధీనిధు లొనరించినారు దేశము మెచ్చన్ !!

(93వ వాయుసేనా దినోత్సవం సందర్భంగా అస్సామ్ లో ఒళ్లు గగుర్పొడిచే విధంగా చేసిన వైమానిక విన్యాసాలు ప్రపంచానికి మన సత్తాను తెలియ చేశాయి)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

సైబర్ నేరాల ఘోర
చిక్కుల్లో నేడు జనం
కనిపించని దొంగలాగ
కొల్లగొట్టుతుంది ధనం.
ఆన్ లైన్ ఫోన్ లైను
అన్నిటిలో చొస్తుంటది
మసలకుంటే జాగ్రత్తగా
మోసాలను చేస్తుంటది

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్  బుధవారం 12-11-2025  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :32  సంచిక:74  పేజీలు:6  వెల: రూ.1/-


## ప్రభుత్వ లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

**-పాఠ్యపుస్తకాల్లో జయ జయహే తెలంగాణ గీతాన్ని చేరుస్తాం**
**-అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం**
**- పాడె మోసి అందెశ్రీకి అంతిమ వీడ్కోలు పల్కిన సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్/ఘట్ కేసర్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా జరిగాయి. అందెశ్రీ అంత్యక్రియల్లో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పాడె మోసి అందెశ్రీకి అంతిమ వీడ్కోలు పలికారు. ఘట్ కేసర్ లో సిఎం మాట్లాడుతూ.. అందెశ్రీ తో గతంలో అనేక విషయాలు చర్చించామని తెలిపారు. జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా నిర్ణయించామని, జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని తెలియజేశారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు.. అందెశ్రీ అని.. రేవంత్ రెడ్డి కొనియాడారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్..
## ఆరుగురు మావోయిస్టుల మృతి

చర్ల, నవంబర్ 10:ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు ఆరుగురు మావోలు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొందని.. ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారని.. భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి కాల్పులు జరుగుతున్నట్లుగా ఆయన వివరించారు. డీఆర్‌జీ బీజాపూర్, దంతేవాడ, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇన్సాస్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్‌తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్, సీఏఎఫ్ దళాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపినట్లు ఐజీ పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను సంఘటనా స్థలంలోనే అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సంఘటనా స్థలంలోనే వారికి చికిత్స అందించి.. అంబులెన్స్ ద్వారా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

## ఆరో జాతీయ జల పురస్కారాల విజేతల ప్రకటన ఈ నెల 18న అవార్డులను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, నవంబర్ 11:జాతీయ స్థాయి 6వ జల పురస్కార విజేతల జాబితాను కేంద్ర జల శక్తి శాఖ మంత్రి శ్రీ సీ ఆర్ పాటిల్ ఈ రోజు న్యూఢిల్లీలోని శ్రమ శక్తి భవన్‌లో ప్రకటించారు. జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) 2024వ సంవత్సరానికి గాను జాతీయ 6వ జల పురస్కారాల్లో సంయుక్త విజేతలు సహా 46 విజేతలను ప్రకటించింది. ఈ పురస్కారాలను 10 విభాగాలలో అందజేస్తారు. వీటిలో అత్యుత్తమ రాష్ట్రం, అత్యుత్తమ జిల్లా, అత్యుత్తమ గ్రామ పంచాయతీ, అత్యుత్తమ పట్టణ స్థానిక సంస్థ, అత్యుత్తమ పాఠశాల లేదా కళాశాల, అత్యుత్తమ పరిశ్రమ, అత్యుత్తమ జల వినియోగదారు సంఘం, అత్యుత్తమ సంస్థ (పాఠశాల లేదా కళాశాల కాకుండా) అత్యుత్తమ పౌర సంఘంతో పాటు జల రంగంలో అత్యుత్తమ వ్యక్తి అనే కేటగిరీలు ఉన్నాయి. విజేతల జాబితాను అనుబంధంలో చూడవచ్చును.

అత్యుత్తమ రాష్ట్రం కేటగిరీలో మొదటి పురస్కారాన్ని మహారాష్ట్రకూ, రెండో పురస్కారాన్ని గుజరాత్‌కూ, మూడో పురస్కారాన్ని హర్యానాకూ ప్రకటించారు.

ప్రతి పురస్కార విజేతకూ ప్రశంసపత్రం, ట్రోఫీతో పాటు కొన్ని కేటగిరీల్లో నగదు బహుమతులను కూడా అందజేస్తారు.

జాతీయ స్థాయి 6వ జల పురస్కారాలు-2024 ప్రదాన కార్యక్రమాన్ని ఈ నెల 18న ఉదయం 11:30 కి న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్లీనరీ హాల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) తెలిపింది. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

జాతీయ జల పురస్కారాల ప్రకటన కార్యక్రమంలో కేబినెట్ మంత్రి తో పాటు జల శక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజ్ భూషణ్ చౌధరీ, జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) కార్యదర్శి శ్రీ వి.ఎల్. కాంతా రావు, తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి శ్రీ అశోక్ కె.కె. మీనా, జల శక్తి శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జాతీయ సంపదగా పరిగణిస్తూ నీటి వనరుల్ని అభివృద్ధిచేయడం, సంరక్షించడంతోపాటు సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన విధాన ప్రణాళికను సిద్ధం చేసి, ఆయా కార్యక్రమాల్ని అమలువరిచే బాధ్యతను జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కేంద్ర శాఖను ఏర్పాటు చేసి అప్పగించారు. నీటి నిర్వహణ, జల సంరక్షణల విషయంలో జాతీయ స్థాయిలో చైతన్యాన్ని పెంపొందింపచేయడానికి గౌరవ ప్రధాన మంత్రి మార్గదర్శకత్వంలో జల శక్తి శాఖ ఒక విస్తృత ఉద్యమాన్ని నడుపుతోంది. ఈ దృష్టికోణానికి అనుగుణంగా, ప్రజల్లో నీటి ప్రాధాన్యం గురించి అవగాహనను పెంచడానికీ, నీటిని ఉపయోగించుకోవడంలో అత్యుత్తమ పద్ధతుల్ని అనుసరించేలా వారిని ప్రోత్సహించడానికీ జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్‌డీ అండ్ జీఆర్) ఒకటో జాతీయ జల పురస్కారాలను ఇవ్వడాన్ని 2018లో మొదలుపెట్టింది. 2వ, 3వ, 4వ, 5వ జాతీయ జల పురస్కారాలను వరుసగా 2019, 2020, 2022, 2023 సంవత్సరాల్లో ఇచ్చారు. 2021లో కోవిడ్ మహమ్మారి కారణంగా పురస్కారాలను ఇవ్వలేదు. హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ)కు చెందిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2024 అక్టోబరు 23న 2024 సంవత్సర ఆరో జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏ) ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 751 దరఖాస్తులు వచ్చాయి. న్యాయ నిర్ణేతల సంఘం సాయంతో దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకన పూర్తి చేశారు. తరువాత తాత్కాలికంగా ఎంపిక చేసిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలనను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)తో కలిసి కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) ముగించింది. ఈ క్షేత్ర స్థాయి నివేదికలను ఆధారం చేసుకొని, సంయుక్త విజేతలు సహా మొత్తం 46 విజేతలను 2024 సంవత్సరానికి గాను10 వేర్వేరు కేటగిరీల్లో 6వ ఎన్‌డబ్ల్యూఏ కోసం ఎంపిక చేశారు.

'జల సమృద్ధ భారత్'కు సంబంధించిన ప్రభుత్వ దృష్టి కోణాన్ని దేశవ్యాప్తంగా వ్యక్తులు, సంస్థల ద్వారా సాకారం చేసే దిశగా మంచి పనులకూ, ప్రయత్నాలకూ జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏస్) ప్రదానం స్ఫూర్తిని పంచుతోంది. నీటి ప్రాధాన్యం విషయంలో ప్రజలలో చైతన్యాన్ని పెంచడం, జల వినియోగానికి సంబంధించి అత్యుత్తమ పద్ధతులను పాటించేటట్లుగా వారికి స్ఫూర్తినివ్వడం ఈ పురస్కారాల ప్రదానం ముఖ్యోద్దేశం. వ్యక్తులకూ, సంస్థలకూ జల వనరుల సంరక్షణ, నిర్వహణ కార్యకలాపాల్లో పాలుపంచుకొనే అవకాశాలతో పాటుగా ప్రజా భాగస్వామ్యాన్ని పటిష్ఠపరిచే అవకాశాలను కూడా ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమం అందిస్తోంది.

## ఉగ్రకుట్ర మూలాలను ఛేదిస్తాం

**- దీనికి బాధ్యులైన కుట్రదారులను వదిలే ప్రసక్తే లేదు**
**- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**



భూటాన్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:);ఢిల్లీ పేలుడు ఘటనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం భూటాన్ పర్యటనలో ఉన్న ప్రధాని.. అక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉగ్రకుట్ర మూలాలను ఛేదిస్తాం. దీనికి బాధ్యులైన కుట్రదారులను వదిలే ప్రసక్తే లేదు. ఢిల్లీ పేలుడు ఘటన తనను కలచివేసిందన్నారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి ఘటన నన్ను కలచివేసింది. దాడికి పాల్పడిన నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోము. దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. అమాయకుల ప్రాణాలు తీసిని వారిని కనిపెట్టి చట్టం ముందు నిలబెడతాం. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి' అని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్లు ప్రధాని ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఢిల్లీ దుర్ఘటన బాధితులకు ఎక్స్-గ్రేషియా..

న్యూఢిల్లీ, నవంబర్ 11:ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్ సమీపంలో జరిగిన బాంబు పేలుడు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో మొదటగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, చికిత్స పొందుతున్న మరో ముగ్గురు ఆసుపత్రిలో మరణించారు. దాంతో మృతుల సంఖ్య 12కి చేరింది.

అయితే, తాజాగా ఢిల్లీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంలో శాశ్వతంగా దివ్యాంగులుగా మారిన వారికి రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా సాయం ప్రకటించింది.

## హైవే- 65 పై ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

**-పిట్టంపల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఒక్కసారిగా మంటలు..**
**-హుటాహుటిన కిందకు దూకిన ప్రయాణికులు**
**-చూస్తుండగానే కాలిబూడిదైన బస్సు**

నల్లొండ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హైవే- 65 పై ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే బస్సు కాలిబూడిదైంది. మంటలు రావడాన్ని గమనించిన ప్రయాణికులు హుటాహుటిన కిందకు దూకేశారు. దీంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సు నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌కు చెందిన విహారి ట్రావెల్స్ బస్సుగా గుర్తించారు. బస్సుకు ఫిట్‌నెస్ కూడా లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

## పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు


**-ఈ ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి**

ఇస్లామాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. ఉగ్రవాదులు జరిపిన ఈ ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి చెందగా.. సుమారు 20 మంది గాయపడ్డారు. మంగళవారం జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో ఈ పేలుడు సంభవించింది. మధ్యాహ్నం 12.30 సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసిన ఓ కారులో పేలుడు జరిగింది. కారులో గ్యాస్ సిలిండర్‌ను అమర్చి పేల్చివేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిచనట్లు అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రంగా ఉండటంతో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ శాతం న్యాయవాదులు, కోర్టులో పని చేస్తున్న సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడి జరిగిన వెంటనే రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దాడికి సంబంధించి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్రవాద సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

## బాంబు పేలుడు నేపథ్యంలో మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్

న్యూఢిల్లీ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలుడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను ఇవాళ మూసివేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. సా. 5 గంటల వరకు 45.50 శాతం పోలింగ్ నమోదు



హైదరాబాద్, నవంబర్ 11: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మరో అర గంటలో ముగియనుంది. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 45.50 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం పోలింగ్ మందకొడిగా కొనసాగుతోంది. ఇక పలు చోట్ల పోలీసులు, ఎన్నికల అధికారులు కాంగ్రెస్ నేతలకు వత్తాసు పలుకుతూ దొంగ ఓట్లు వేయించేందుకు సహకరిస్తున్నారు. యూసుఫ్‌గూడ పరిధిలోని కృష్ణానగర్, శ్రీనగర్‌లోని పోలింగ్ బూతుల వద్ద దొంగ ఓట్లు భారీగా వేస్తున్నారు. దొంగ ఓట్లపై బీఆర్ఎస్ నేతలు నిలదీయగా, వారిని అరెస్టు చేశారు పోలీసులు. మరో వైపు షేక్‌పేట పరిధిలోని పలు బూతుల వద్ద పోలీసులు బీఆర్ఎస్ నేతలపై లాఠీఛార్జి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పోలింగ్ సమయం ముగిసే సమయానికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అవకాశం ఇవ్వనున్నారు.

## జూబ్లీహిల్స్‌లో నాన్ లోకల్ నాయకులపై ఎన్నికల సంఘం ఆగ్రహం

**-కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్ లపై చర్యలకు ఆదేశం**

హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జూబ్లీహిల్స్‌లో నాన్ లోకల్ నాయకులపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్ పోలింగ్ బూత్‌కు రావడంపై సీరియస్ అయింది. ఓటర్లను ప్రభావితం చేసేలా తిరుగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.స్థానికేతరులైన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు నియోజకవర్గంలో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమాలకు తెరతీశారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌డీపీ హోటల్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్సీ శంకర్ తన అనుచరులతో హల్‌చల్ చేశారు. మరో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ పెత్తనం చలాయించారు. వెంగళరావునగర్ పోలింగ్ బూత్ వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి భర్త మట్టా దయానంద్ ఉన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. రహమత్ నగర్ పోలింగ్ కేంద్రం వద్ద కూర్చొని ఓటర్లతో మాట్లాడారు. దీంతో ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

## ఎవరీ డాక్టర్ ఉమర్ మహమ్మద్.. ఆ సూసైడ్ బాంబర్ డీటైల్స్ ఇవే!



న్యూఢిల్లీ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఢిల్లీ కారు బాంబు పేలుడులో సూత్రధారిగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ ను భద్రతాధికారులు అనుమానిస్తున్నారు. రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ వద్ద పేలిన కారులో అతనే ఉన్నట్లు కూడా భావిస్తున్నారు. బహుషా అతను ఆత్మహుతి దాడికి పాల్పడి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. హుందయ్ ఐ20 తెలుపు రంగు కారులో అతను ప్రయాణించాడు.

డాక్టర్ ఉమర్ మహమ్మద్ 1989 ఫిబ్రవరి 24వ తేదీన జన్మించాడు. పుల్వామాలోని కోయిల్ గ్రామం అతనిది. తండ్రి జీహెచ్ నబీ భట్, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేసి 10 సంవత్సరాల క్రితం ఉద్యోగం మానేసినట్లు సమాచారం. తల్లి షమీమా బానొ, గృహిణి. శ్రీనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశాడు. అనంతనాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కొన్నాళ్లు సీనియర్ రెసిడెంట్‌గా పని చేసిన అనంతరం పరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వైద్య విభాగంలో అసిస్టెంట్ ఫొఫెసర్‌గా చేరాడు. అక్కడ పనిచేస్తున్నపటినుంచి సోషల్ మీడియా ద్వారా టెర్రర్ భావజాలానికి డాక్టర్ ఉమర్ ఆకర్షితులైనట్లు తెలుస్తోంది.పుల్వామాకు చెందిన ఈ డాక్టర్.. ఫరీదాబాద్‌లో ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల అక్కడ బయటపడిన టెర్రర్ మాడ్యూల్‌తో అతనికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించిన టెర్రర్ ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో అదీల్ అహ్మద్ రాథర్, ముజామిల్ షకీల్ అనే డాక్టర్లు ఫరీదాబాద్‌లో ఉన్న అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీలో ఉమర్‌తో పాటు కలిసి పనిచేశారు. ఆ ఇద్దరి డాక్టర్లతో ఉమర్‌కు సంబంధాలు ఉన్నట్లు భద్రతాధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఇదంతా తెలుసుకున్న ఉమర్ ఎక్కడ దొరికిపోతానేమోనన్న భయంతో ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉంటారని అనుకుంటున్నారు.చిన్నప్పటి నుంచి కూడా ఉమర్ పుస్తకాల పురుగు అని అతని మేన కోడలు ముజామిల్ చెబుతున్నారు. ఉమర్ ఎక్కువగా ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతాడని చెప్పింది. చిన్నతనం నుంచి అతను అంతర్ముఖుడే. అతనికి ఎక్కువగా ఫ్రెండ్స్ లేరు. కేవలం స్టడీస్, వర్క్ మీదనే అతను ఫోకస్ చేసేవాడని మేనకోడలు తెలిపింది.ఫరీదాబాద్ కాలేజీలో ఫ్యాకల్టీగా చేస్తున్నట్లు పేర్కొన్నది. శుక్రవారం ఫోన్ చేశాడని, పరీక్షల వల్ల బిజీగా ఉన్నానని, మూడు రోజుల తర్వాత ఇంటికి రానున్నట్లు చెప్పాడు. చిన్నప్పటి నుంచి రిజర్వ్‌గా ఉండే వ్యక్తి అని ముజామిల్ పేర్కొన్నది. ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తి కాదు అని ఆమె స్పష్టం చేసింది.

# భారీ పెట్టుబడులే లక్ష్యం

## –విశాఖ సీఐఐకి 45 దేశాల ప్రతినిధులు
## –మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

శ్రీకాకుళం, నవంబర్ 10:విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి, రాష్ట్రంపై చిరస్థాయి ముద్ర వేయడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి వర్చువల్‌గా పాల్గొన్న, జి. సిగడాం మండలం సంత ఉరిటిలో 100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ సీఐఐ సదస్సు కు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 8 మంది స్పీకర్లు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 37 ప్లీనరీ సెషన్లు, కంట్రీ సెషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని, ఈ సమావేశాల్లో వివిధ దేశాల ప్రతినిధులు, పలు ప్రముఖ కంపెనీల సీఎక్సోలు, ఆర్థిక నిపుణులు, కేంద్ర మంత్రులు పాల్గొని వివిధ దేశాల్లో వాణిజ్యానికి ఉన్న



అవకాశాలపై చర్చిస్తారన్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాలకు సంబంధించి 410 ఒప్పందాలను కుదుర్చుకోనుందని, వీటి ద్వారా రాష్ట్రానికి సుమారు రూ. 9.76 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన

జి. సిగడాం మండలం సంత ఉరిటిలోని బయోగ్యాస్ ప్రాసెసింగ్ యూనిట్ సుమారు 100 రూపాయిల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ ప్లాంట్ నిర్మాణం ద్వారా సుమారు 500 మందికి ప్రత్యక్షంగా, 1,000 మంది రైతులకు పరోక్షంగా ఉపాధి లభిస్తుందని నిర్మాణ సంస్థ ప్రతినిధి రామ్మోహన్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ మాట్లాడుతూ, ఈ ఉపాధి అవకాశాల ద్వారా యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పలాస, ఇచ్ఛాపురంలలో కూడా ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, శ్రీకాకుళం ఆర్డీవో కే సాయి ప్రత్యూష, డీపీఓ భారతీ సౌజన్య, తహసీల్దార్ ఎం సరిత, సంత ఉరిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, జి. సిగడాం ఎంపీడీవో జి రామకృష్ణ రావు, పొందూరు ఎంపీడీవో ఎన్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

# 'కాపస్ కిసాన్' యాప్‌తో రైతులకు లాభం

కారేపల్లి, నవంబర్ 11 : ప్రభుత్వం తీసుకువచ్చిన "కాపస్ కిసాన్" మొబైల్ యాప్ రైతులకు మరింత పారదర్శకంగా, నేరుగా లాభదాయకంగా ఉండనుందని ఇల్లెందు వ్యవసాయ శాఖ అధికారి గ్రేడ్ 3 కార్యదర్శి నరేశ్ కుమార్ తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ పత్తి విక్రయానికి సంబంధించిన వివరాలను నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. దీంతో మధ్యవర్తులకు చెక్ పెట్టి రైతులకు నేరుగా లాభం చేకూరే అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీ లక్ష్మి కాటెక్స్ జిన్నింగ్ మిల్ ప్రాంగణంలో పత్తి విక్రయాలకు సంబంధించి ఏర్పాటు చేసిన సిసిఐ (అఅఎ) కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ గత రెండేళ్లుగా సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు న్యాయమైన ధరలు అందేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,150 మంది రైతుల నుండి మొత్తం 32,725.10 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,629 మంది రైతుల నుండి 43,293.45 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

పత్తి విక్రయానికి తీసుకురావడానికి ముందు తేమ శాతం 12 కంటే తక్కువగా ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. తక్కువ తేమ ఉన్న పత్తికి మంచి ధర లభిస్తుందని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. ఈ హెల్ప్ డెస్కులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులకు సేవలు అందిస్తాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పారదర్శక విధానాలను సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యత కలిగిన పత్తిని తక్కువ తేమతో సిసిఐ కేంద్రాలకు తీసుకువచ్చి అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..



బిచ్కుంద నవంబర్ 10:సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని కళ్యాణ లక్ష్మి చెక్కులను ఈ రోజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వంతుల వారిగా సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదుకుంటుందని ఆయన అన్నారు. ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ విద్యుత్ సరఫరా, గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై పలు పథకాలను అందజేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలివరీ విట్టల్ రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పుల్కల్ వెంకట్రామిరెడ్డి, పుల్కల్ సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బిచ్కుంద మండల పార్టీ అధ్యక్షుడు ధర్పల్లి గంగాధర్, మైనార్టీ నాయకులు ఖలీల్, తెలంగాణ పార్టీ ఉద్యమకారుడు అసద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఎంజీయూ పరిధిలో పలు సెమిస్టర్ పరీక్షలు

## –ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలు
## – హాజరుకానున్న 18,827 మంది విద్యార్థులు

నల్గొండ, నవంబర్ 11:నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ 1, 3, 5 రెగ్యూలర్ అండ్ బ్యాక్ లాగ్ పరీక్షలను ఈ నెల 13 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే వర్సిటీ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,827 మంది విద్యార్థులు హాజరవుతుండగా 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకై ఆన్‌లైన్ ప్రశ్నపత్రంతో పాటు అందుకు సంబంధించి మెటీరియల్స్ ను ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు ఎంజీయూ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సరఫరా చేశారు. అదే విధంగా పరీక్షల పటిష్ట నిర్వహణకై సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా

పరీక్షల నిర్వహణకై ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 30 (నల్లగొండ జిల్లాలో 12, సూర్యాపేట జిల్లాలో 02, యాదాద్రి భువనగిరి జిల్లాలో 03) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు మొత్తం 18,827 మంది హాజరవుతున్నారు.



1వ సెమిస్టర్‌లో 5,400 మంది, 3వ సెమిస్టర్‌లో 5,830, 5వ సెమిస్టర్‌లో 5,597 మంది విద్యార్థులు ఉన్నారు.

పటిష్ట ఏర్పాట్లు చేశాం : డా. జి.ఉపేందర్‌రెడ్డి, సీఓఈ, ఎంజీయూ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంజీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ 1, 3, 5 రెగ్యూలర్, బ్యాక్ లాగ్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు సజావుగా సాగేలా వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్టర్ ప్రొఫెసర్ అల్వాల రవి ఆదేశాలతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా తప్పులు జరిగితే ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండ్స్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. విద్యార్థులందరికీ సకాలంలో హాల్ టికెట్స్ అందించాలి.

# పట్టణ సహకార రుణ రంగంపై న్యూఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు

## 'కో-ఆప్ కుంభ్-2025'లో కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగం

న్యూఢిల్లీ, నవంబర్ 11:పట్టణ సహకార రుణ రంగంపై న్యూఢిల్లీలో ఇవాళ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు 'కో–ఆప్ కుంభ్–2025'లో కేంద్ర హోం–సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొనడంతోపాటు హాజరైన వారినుద్దేశించి ప్రసంగించారు. కేంద్ర సహకార శాఖ సహాయమంత్రి శ్రీ క్రిషన్ పాల్ గుర్జర్, కార్యదర్శి సహా అనేకమంది ప్రముఖులు కూడా ఇందులో పాల్గొన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా పట్టణ సహకార బ్యాంకులు, సహకార రుణ పరపతి సంఘాలతో ప్రస్తుత 'సహకార కుంభ్' నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. దేశంలోని పట్టణ సహకార బ్యాంకింగ్ రంగం, సహకార రుణపరపతి రంగాలు గడచిన మూడునాలుగేళ్లుగా నవ్యోత్సాహంతో ముందడుగు వేస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ రంగం సంబంధిత అనేక అవకాశాల సద్వినియోగం దిశగా విధానం, సాంకేతికత, ఆవిష్కరణలపై 'కో–ఆప్ కుంభ్–2025'లో చర్చలు సాగుతాయని ఆయన తెలిపారు. పట్టణ సహకార బ్యాంకులు, సహకార రుణపరపతి సంఘాల జాతీయ సమాఖ్య (నాఫ్కబ్) నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సు ఆమోదించే 'ఢిల్లీ డిక్లరేషన్–2025' పట్టణ సహకార బ్యాంకుల విస్తరణకు ఒక ప్రణాళిక కాగలదని ఆయన స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా పట్టణ సహకార బ్యాంకుల విస్తరణపై తమ కలలు 'కో–ఆప్ కుంభ్–2025' ద్వారా అతి త్వరలో సాకారం కాగలవని శ్రీ అమిత్ షా ఆశాభావం వెలిబుచ్చారు. ఇందులో భాగంగా ఇవాళ 'సహకార్ డిజీ–పే', సహకార్ డిజీ–లోన్' అనువర్తనాలను అంబ్రెల్లా ఆర్గనైజేషన్ ప్రారంభించిందని ఆయన అన్నారు. 'డిజీ–పే' యాప్ ద్వారా అతి చిన్న పట్టణ సహకార బ్యాంకులు కూడా డిజిటల్ చెల్లింపు సౌకర్యం కల్పించగలవని తెలిపారు.

దేశంలో సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటైన నాటినుంచీ సహకార సంస్థల సంబంధిత ప్రతి అంశంలోనూ ప్రాథమిక మార్పులు తేవడం కోసం మోదీ ప్రభుత్వం అనేక కీలక విధాన నిర్ణయాలు తీసుకుందని కేంద్ర హోం–సహకార శాఖల మంత్రి గుర్తుచేశారు. దీంతోపాటు సహకార రంగ ఆధునికీకరణ, సమస్యల పరిష్కారం సహా సహకార సంస్థల పరిధి విస్తరణకూ ప్రధాని అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. 'ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా (పీఏసీఎస్)లకు సంబంధించిన నమూనా విధివిధానాలను దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయని ఆయన చెప్పారు.

సహకార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం నాలుగు లక్ష్యాలను నిర్దేశించుకున్నదని శ్రీ అమిత్ షా అన్నారు. వీటిలో మొదటిది 'భావితరం సహకారాభివృద్ధి'? దీనికింద యువతరాన్ని సహకార ఉద్యమంతో అనుసంధానించడమని వివరించారు. ఇందుకోసమే 'త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహకార రంగంలోని అన్ని రకాల అవసరాలనూ ఇది తీరుస్తుంది. ఇక రెండోది– అన్నిరకాల సమస్యను పరిష్కరించగలిగేలా సహకార సంఘాల సామర్థ్యం పెంచడమని ఆయన అన్నారు. రాబోయే ఐదేళ్లలోగా 2 లక్షలకుపైగా జనాభా గల ప్రతి నగరంలో ఒక పట్టణ సహకార బ్యాంకును ఏర్పాటు చేయడం మూడో లక్ష్యమని చెప్పారు. యువ ఔత్సాహికులు, స్వయం సహాయ సంఘాలు, సమాజంలోని బలహీన వర్గాల సాధికారత కోసం బహుళ రంగ విధానంతో పట్టణ సహకార బ్యాంకులు తమ కీలక విధులను నిర్వహించాలని శ్రీ అమిత్ షా తెలిపారు. సహకార సంస్థల బలోపేతం తమ నాలుగో లక్ష్యమని, అదే సమయంలో బలహీన వర్గాల బలోపేతం కూడా ఇందులో భాగమని తెలిపారు. పట్టణ సహకార బ్యాంకులు తప్ప మరే ఇతర సంస్థలూ ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. పట్టణ సహకార బ్యాంకుల ద్వారా ఆర్థికంగా బలహీనులైన వ్యక్తులకు సాధికారత కల్పించడం కూడా ఒక లక్ష్యంగా ఉండాలని ఆయన సూచించారు.

గడచిన రెండేళ్లలో నిరర్థక ఆస్తులను 2.8 శాతం నుంచి 0.06 శాతానికి తగ్గించడంలో తాము విజయం సాధించామని కేంద్ర సహకార శాఖ మంత్రి అన్నారు. దీంతోపాటు కార్యాచరణ ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు ఆర్థిక క్రమశిక్షణలో ఇప్పటికే సాధించిన విజయాలను మరింత పటిష్టం చేయాల్సి ఉందన్నారు. సహకార సంఘాలను బ్యాంకులుగా మార్చే దిశగా కృషి చేస్తేనే ప్రతి నగరంలో ఒక పట్టణ సహకార బ్యాంకు స్థాపన సాధ్యం కాగలదన్నారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణాంకాలు మాత్రమే మన ప్రగతిని ప్రతిబింబించజాలవని ఆయన చెప్పారు. వాటితోపాటు ప్రతి వ్యక్తికీ పని లభించే విధంగానూ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగానూ చూసుకోవాలని సూచించారు. సహకార సంఘాల పాత్ర లేకుండా ఈ లక్ష్యం సాధించడం సాధ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సహకార సంస్థల భావనతోపాటు వాటి ప్రాధాన్యాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇకపై పారదర్శకంగా, ఫలితాల సాధన ప్రాతిపదికగా సరికొత్త విశ్వాసం, కృషి అవసరమని శ్రీ అమిత్ షా అన్నారు.

మన దేశంలోని 'అమూల్, ఇఫ్కో' సంస్థలు అంతర్జాతీయ సహకార కూటమి ప్రపంచ ర్యాంకింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయని ఆయన తెలిపారు. సహకార సంఘాల ఆలోచన, సంస్కృతి నేటికీ పాతబడలేదనడానికి ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో శ్వేత విప్లవానికి అమూల్ సారథ్యం వహించిందని, తన పరిధిలోని 36 లక్షల మంది పాడిరైతులు, 18,000 గ్రామ సంఘాలు, 18 జిల్లా సంఘాల ద్వారా ఈ సంస్థ దేశవ్యాప్తంగా నిత్యం 3 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ క్రమంలో 2024?25 ఆర్థిక సంవత్సరం అమూల్ సంస్థ వార్షిక వ్యాపార పరిమాణం రూ.90,000 కోట్లు దాటిందని గుర్తుచేశారు. 36 లక్షల మంది పాడి రైతులలో 65 శాతానికిపైగా మహిళలు కావడం ఈ సందర్భంగా గమనార్హమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. స్వల్పస్థాయి వ్యక్తిగత సహకారంతో అనేక ఏళ్లుగా ఇంత పెద్ద సహకార సంస్థను విజయవంతంగా నిర్వహిస్తుండటం విశేషమని అభివర్ణించారు. మన దేశంలో సహకార సంస్థలకు అందుబాటులోగల విస్తృత సామర్థ్యాన్ని ఈ పరిణామాం ప్రతిబింబిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

మన 'ఇఫ్కో' ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సహకార సంస్థగా పరిగణన పొందడం గర్వకారణమని కేంద్ర సహకార మంత్రి అన్నారు. ఈ సంస్థ రూ.41,000 కోట్ల వార్షిక వ్యాపార పరిమాణంతోపాటు రూ.3,000 కోట్ల లాభాలను నమోదు చేసిందని గుర్తుచేశారు. 'ఇఫ్కో' సహకార సంఘాల సాముదాయక సంస్థ కాగా, దేశంలోని 35,000 సహకార సంఘాలు (వీటిలో అధికశాతం 'పీఏసీఎస్'లు), మార్కెటింగ్ సంబంధిత సంఘాలు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఈ సంఘాల ద్వారా 5 కోట్ల మందికిపైగా రైతులు 'ఇఫ్కో'లో సభ్యులయ్యారని తెలిపారు. ఈ సంస్థ ఇవాళ 93 లక్షల టన్నుల యూరియా, 'డీఏపీ' ఉత్పత్తి చేస్తూ దేశంలో హరిత విప్లవానికి మూలస్తంభంగా నిలిచిందన్నారు. 'ఇఫ్కో' తయారుచేస్తున్న నానో యూరియా, నానో డీఏపీ ఇప్పుడు బ్రెజిల్, ఓమన్, అమెరికా, జోర్డాన్ సహా 65 దేశాలకు ఎగుమతి అవుతున్నదని ఆయన తెలిపారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : సీడీపీఓ అస్రం అంజు

నల్గొండ, నవంబర్ 11: సమాజంలో బాల్య వివాహాలు, శిశు విక్రయాలు చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సీడీపీఓ అస్రం అంజు అన్నారు. మంగళవారం కట్టంగూర్ లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, శిశు విక్రయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని. బాల్య వివాహాలను చేయడం, ప్రోత్సహిం చడం చట్టరీత్యా నేరమన్నారు.

శిశు విక్రయాలు తీవ్రమైన నేరమని, ఎవరైనా శిశువులను విక్రయించేందుకు ప్రయత్నించినా, విక్రయించిన చట్టపరంగా చర్యలు ఉంటామని తెలిపారు. బాల్య వివాహాలు, శిశు విక్రయాలపై తల్లిదండ్రులు, విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులచే బాల్య వివాహాలు, శిశు విక్రయాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు బూరుగు శారదారాణి, పద్మావతి, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఎన్జీఓ ఝాన్సీ, పాఠశాల ఎన్ఓ నీలాంబరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : జల్లెల పెంటయ్య

రామన్నపేట, నవంబర్ 11 : నల్గొండ, నవంబర్ 11:మిల్లర్ల దోపిడీని అరికట్టాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు బల్గురి అంజయ్య అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో జరిగిన మండల కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత నెల రోజులకు పైగా దాన్యం పోసి కొనుగోళ్లు కాక, వాతావరణం సహకరించక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక మంది రైతుల ధాన్యం కొట్టుకుపోగా, మరికొందరిది తడిసి మొలకెత్తిందన్నారు. అప్పులు చేసి ఆరుగాలం కష్టపడి పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన పంట కొనకుండా ప్రభుత్వం కాలయాపన చేయడంతో రైతులకు టార్పాలిన్లు, కూలిల ఖర్చు మీద పడుతుందన్నారు. లారీలు, భార్దాని, హమాలీల కొరత లేకుండా వెనువెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

రైస్ మిల్లర్లు కోత్రిలు పెడుతూ కోత విధించటంతో రైతులకు ఏం మిగలక ఇబ్బంది పడుతున్నారని, అధికారులు రైస్ మిల్లు యాజమాన్యాలతో కుమ్మక్కయి రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వెంటనే కొనుగోలును పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యుడు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హనుమతు, జంపాల అండాలు, రైతు సంఘం మండలాధ్యక్షుడు గన్నేబోయిన విజయభాస్కర్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, వేముల సైదులు, ఆవనగంటి నగేశ్, శాఖ కార్యదర్శులు మునికుంట్ల లెనిన్, శానగొండ వెంకటేశ్వర్లు, గుండాల ప్రసాద్, గంగాదేవి అంజయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన అఖండ హరి నామ సప్తాహ



ఆదిలాబాద్, నవంబర్ 11: నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని మరో పండరిపురంగా పిలుచుకునే విఠలేశ్వరాలయంలో మంగళవారం అఖండ హరినామ సప్తాహ మంత్రోచ్చరణలనడుమ ఘనంగా ప్రారంభమైంది. ఆలయ పూజారులు ప్రమోద్ మహారాజ్, రాజు మహారాజ్ ఆలయ ప్రాంగణంలోని గణపతి, విఠల–రుక్మిణి విగ్రహాలకు ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు.

ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో నిర్ణయించిన ముహూర్తంలో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజీ, ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి బచ్చు ప్రసాద్, గ్రామస్తులు పుప్పాల పీరాజి, కందుర్ రాజన్న, భజన కారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్లు పొందవచ్చు..


నకిరేకల్, నవంబర్ 11: నకిరేకల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా రూ.4 లక్షల విలువ గల 31 మొబైల్ ఫోన్లను ట్రేస్‌చేసి రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ రోజు నకిరేకల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.శివరాం రెడనమావేశంలో వివరాలు వెల్లడించారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగం విస్తృతంగా పెరగడంతో ఫోన్లు పోగొట్టుకునే ఘటనలు కూడా పెరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రారంభించిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు అనేక మంది బాధితులు తమ ఫోన్లు తిరిగి పొందినట్లు వివరించారు. ఫోన్ పొయినా వెంటనే సిమ్ బ్లాక్ చేయడం, బ్యాంక్ ఖాతాలను రక్షించుకోవడం అవసరం. తరువాత సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన సూచించారు.

గుర్తు తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్, ఓటిపి లేదా బ్యాంక్ వివరాలకు సంబంధించిన కాల్స్ వచ్చినప్పుడు వాటిని ఓపెన్ చేయకూడదు, స్పందించకూడదని ఆయన తెలిపారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 1930 సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# మేడారానికి రేపు నలుగురు మంత్రులు..

హైదరాబాద్, నవంబర్ 11: మేడారం మహాజాతర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు రాష్ట్ర మంత్రులు రేపు బుధవారం మేడారం వెళ్లనున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరు లక్ష్మణ్, కొండా సురేఖలు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మేడారం చేరుకోనున్నారు. మహాజాతర ఏర్పాటలో భాగం గా జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మధ్యాహ్నం 12 గంటలకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం కానున్నారు.

# వినూత్నంగా ఆలోచించాలి...

## -సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు

## -పైడి భీమవరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ప్రారంభం



శ్రీకాకుళం, నవంబర్ 10:రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా, ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువ పారిశ్రామికవేత్తలు వినూత్నంగా ఆలోచించి, వినూత్న ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం, పైడి భీమవరంలో రూ.14.60 కోట్ల వ్యయంతో 1.99 ఎకరాల్లో నిర్మించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవనాన్ని ముఖ్యమంత్రి మంగళవారం 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో సీఎం వర్చువల్ గా మాట్లాడారు. పైడి భీమవరం ఐడీఏలో లిక్విడ్ ఆక్సిజన్ పరిశ్రమను స్థాపించిన లిక్వినాక్స్ సంస్థ అధినేత రాజేష్ బాబు చేసిన సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కొనియాడారు. రాజేష్ బాబు మాట్లాడుతూ.. 2016 వీఎస్పీ భాగస్వామ్య సదస్సులో ఎంఓయూ కుదుర్చుకున్నామని, ఆ తర్వాత 2019లో ఉత్పత్తి ప్రారంభించి, 2020లో కరోనా కష్టకాలంలో తమ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేసి, లక్షలాది మంది ప్రాణాలను కాపాడినట్లు వివరించారు. రిమ్స్, జెమ్స్, కేజీహెచ్ ఆసుపత్రులకు నిరంతరాయంగా ఆక్సిజన్ సిలిండర్ లను అందజేశామని వివరించారు.

ఈ కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, విద్యార్థులు సైతం ఇప్పటి నుంచే వినూత్న ఆవిష్కరణల దిశగా ప్రయత్నించాలని సూచించారు. జిల్లాలోని సంత ఉరిటిలో వరి ఇతర పంటల వ్యర్థాల నుండి బయో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ఉత్పత్తి చేసే పరిశ్రమను స్థాపిస్తున్నట్లు విజయనగరానికి చెందిన పి.వి.ఎస్. రామస్వామి తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచన విధానాన్ని ప్రేరణగా తీసుకుని తాను ఈ పరిశ్రమకి అంకురార్పణ చేసామని, వీఎస్పీ సీఐఐ సదస్సులో ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు ఆయన ముఖ్యమంత్రికి తెలియజేశారు. వర్చువల్ ప్రారంభోత్సవం ముగిసిన అనంతరం, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవనాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదుటి ఈశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వి రాజ్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ సహా పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి..

## -క్రీడా ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులు



హైదరాబాద్, నవంబర్ 11: విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌అన్నారు. ఈ రోజు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణిస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉండాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని, స్నేహభావం పెంపొందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు.

క్రీడలతో చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

2025-26 ఏడాదికి మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో విద్యార్థులు పోటీలలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు. ఈ పోటీలలో జిల్లాలోని గుడిపేట బాలుర జట్టు మొదటి బహుమతి, నిర్మల్ జిల్లా బాలుర జట్టుద్వితీయ బహుమతి గెలుపొందారని తెలిపారు. విద్యార్థులు చదువులో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీ..

నారాయణ పేట నవంబర్ 10: నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ రోజు మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల బోధనా సామర్థ్యాన్ని పరిశీలించారు.

పదో తరగతిలో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనంనాణ్యతను పరిశీలించేందుకు గాను విద్యార్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద జయంతి వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు.

# సూర్యాపేటలో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు

సూర్యాపేట, నవంబర్ 11 : దేశ రాజధాని నగరం ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల సంఘటన నేపథ్యంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది మంగళవారం సూర్యాపేట పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పౌరుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు కొత్త బస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టింది. బస్సులు నిలుపు ప్రాంగణాలను, దుకాణాలు, బస్సులు, ప్రయాణికుల లగేజీ, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నివారణ కోసం విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు. గుర్తింపు నిర్ధారణ లేని వ్యక్తులకు, అనుమానితులకు లాడ్జ్ ల నందు వసతి ఇవ్వవద్దని నిర్వాహకులకు సూచించారు.

# విజయవాడ - దువ్వాడ సెక్షన్ మధ్య పలు రైళ్లు రద్దు

అమరావతి, నవంబర్ 10:విజయవాడ- దువ్వాడ సెక్షన్ మీదుగా నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 20న నడవనున్న కాకినాడ పోర్టు- విశాఖపట్నం (17267), విశాఖ - కాకినాడ పోర్టు (17268), రాజమండ్రి - విశాఖ (67285), విశాఖ - రాజమండ్రి ( 67286 ) మధ్య నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు ఒక ప్రకటనలో దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 12న నర్సాపూర్ - సికింద్రాబాద్, 15వ తేదీన అనకాపల్లి - సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు తెలిపింది.

# చరిత్రాత్మకంగా సాయ్‌లో అసిస్టెంట్ కోచ్‌ల నియామకాలను చేపట్టనున్నట్లు ప్రకటించిన కేంద్ర క్రీడా మంత్రి డా. మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, నవంబర్ 11:చరిత్రాత్మకంగా భారత క్రీడా ప్రాధికార సంస్థలో (సాయ్) అసిస్టెంట్ కోచ్ పోస్టుల (7వ సీపీసీ వేతనాలు, స్థాయి- 06) కోసం నియామక కార్యక్రమానికి యువజన వ్యవహారాలు- క్రీడల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 2017 తర్వాత నియామకాలు జరగడం అదీ ఈ స్థాయిలో, ఇదే మొదటిసారి. భారతీయ క్రీడలలో ముఖ్య పాత్ర పోషించే ఈ పోస్టుల కోసం చేపట్టే అతిపెద్ద నియామక ప్రక్రియ కూడా ఇదే. ఈ రోజు మీడియాతో మాట్లాడిన కేంద్ర యువజన వ్యవహారాలు - క్రీడలు, కార్మిక - ఉపాధి శాఖ మంత్రి శ్రీ డా. మన్‌సుఖ్ మాండవీయ ఈ విషయాన్ని ప్రకటించారు.

"ప్రతిభ ఆధారంగా నిష్పాక్షికత, పారదర్శకతతో నియామకం జరిగేలా చూసుకునేందుకు.. ప్రతిభావంతులైన ఉత్తమ కోచ్‌లను గుర్తించి ఎంపిక చేసేందుకు ఒక సమగ్ర ప్రక్రియను ఏర్పాటు చేయనున్నాం. రాబోయే సంవత్సరాల్లో భారత క్రీడా రంగపు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఈ వ్యూహాత్మక నియామకం కీలక పాత్ర పోషిస్తుంది" అని శ్రీ డా. మన్‌సుఖ్ మాండవీయ వ్యాఖ్యానించారు.

"ఈ నియామక కార్యక్రమం భారత్‌ను ప్రపంచ క్రీడా శక్తిగా మార్చటంతో పాటు పారదర్శక- ప్రతిభ ఆధారిత వ్యవస్థలు, సంస్థాగత సామర్థ్యం పెంపుదల ద్వారా దేశ క్రీడా వ్యవస్థను బలోపేతం చేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ఉంది. " అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

25 క్రీడా విభాగాలలో 320కి పైగా ఖాళీలు నేరుగా భర్తీ చేయనున్నారు. దేశ క్రీడా అభివృద్ధిలో అసిస్టెంట్ కోచ్ క్యాడర్ ఒక ముఖ్యమైన అనుసంధాన పాత్ర పోషిస్తుంది. క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు క్రీడా ప్రతిభావంతులను గుర్తించి, వారిని మరింత మెరుగుపరిచే పునాదిగా అసిస్టెంట్ కోచ్‌లు పనిచేస్తారు. ఈ క్యాడర్‌ను బలోపేతం చేయడం అనేది భారత్‌లోని అథ్లెట్లకు నిర్మాణాత్మక, అధిక-నాణ్యత గల కోచింగ్ అందించేందుకు దోహదపడుతుంది.

ఒలింపిక్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించేందుకు ప్రభుత్వం అనుసరిస్తోన్న వ్యూహానికి అనుగుణంగా ఈ నియామక ప్రక్రియను రూపొందించనున్నారు. పతకాలు సాధించే అవకాశం ఎక్కువ ఉన్న నీటిలో ఆడే ఆటలు, సైక్లింగ్ వంటి క్రీడా విభాగాలపై ఇది దృష్టి సారిస్తుంది. వీటితో పాటు దేశంలో విస్తృత క్రీడా సంస్కృతి, సమగ్ర క్రీడా వ్యవస్థను తయారుచేసేందుకు దోహదపడే క్రీడలకు కూడా ప్రాధాన్యత లభించనుంది. గతంలో తక్కువ దృష్టి సారించిన లాన్ టెన్నిస్, కయాకింగ్, కానోయింగ్ వంటి ఆటల్లో అవకాశాలు, ప్రాముఖ్యత పెరుగుతున్నందున.. ఈ క్రీడా విభాగాలలో కోచ్‌లను నియమించటంపై కూడా ఈ విడత ఎంపిక ప్రక్రియ ప్రత్యేక దృష్టి సారించనుంది.

లింగ సమ్మిళితత్వం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా 50 శాతం కంటే ఎక్కువ పోస్టులను మహిళలకు కేటాయించారు. ఇది దేశంలో మహిళా కోచ్‌ల కొరతను తీర్చడమే కాకుండా సురక్షితమైన క్రీడా వాతావరణాన్ని కూడా బలోపేతం చేస్తుంది. తద్వారా దేశానికి గర్వకారణమైన మహిళా క్రీడాకారులందరికీ భద్రత, ఆత్మవిశ్వాసం, సాధికారత లభిస్తాయి.

ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలనే భారతదేశ ఆశయానికి అనుగుణంగా పనితీరు ఆధారిత బలమైన, సమ్మిళితమైన కోచింగ్ వ్యవస్థను తయారు చేసేందుకు మంత్రిత్వ శాఖ చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఈ నియామకాలే నిదర్శనం.

# అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన డీపీఎస్‌యూ భవన్‌ను ప్రారంభించిన రక్షణ మంత్రి: డీపీఎస్‌యూల పనితీరుపై న్యూఢిల్లీలో సమీక్ష

న్యూఢిల్లీ, నవంబర్ 11:న్యూఢిల్లీలోని నౌరోజీ నగర్ ప్రపంచ వాణిజ్య కేంద్రంలో కొత్తగా ప్రారంభించిన డీపీఎస్‌యూ భవన్లో 2025 నవంబర్ 10న జరిగిన ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ (డీపీఎస్‌యూ)ల సమగ్ర సమీక్షా సమావేశానికి రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. మినీరత్న (కేటగిరీ-1) హోదా దక్కిన నాలుగు డీపీఎస్‌యూలు - మ్యునిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్), ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్), ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ (ఐవోఎల్), హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)ను ఈ సమావేశంలో ప్రశంసించారు.

సమావేశాన్ని ఉద్దేశించి శ్రీ రాజనాథ్ సింగ్ ప్రసంగిస్తూ.. రక్షణ తయారీ వ్యవస్థలో దేశాన్ని బలోపేతం చేయడానికి, స్వావలంబన భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి డీపీఎస్‌యూలు నిలకడగా కొనసాగిస్తున్న కృషిని ప్రశంసించారు. "దేశ స్వావలంబన దిశగా మన 16 డీపీఎస్‌యూలు పనిచేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ తరహా కార్యకలాపాల్లో దేశీయంగా తయారు చేసిన ఆయుధ వ్యవస్థల పనితీరు.. వాటి విశ్వసనీయతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. అంకితభావం, అద్భుతమైన పనితీరు కనబరుస్తున్న ఈ సంస్థలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

మినీరత్న హోదాను సాధించిన హెచ్ఎస్ఎల్, ఏవీఎన్ఎల్, ఐవోఎల్, ఎంఐఎల్ సంస్థలను శ్రీ రాజనాథ్ సింగ్ అభినందించారు. దీన్ని రక్షణ రంగంలో పెరుగుతున్న వాటి సామర్థ్యానికి, స్వతంత్ర ప్రతిపత్తికి, సహకారానికి సూచనగా వర్ణించారు. 2021లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును ఏడు కొత్త డీపీఎస్‌యూలుగా విభజించడం వల్ల నిర్వాహక స్వాతంత్ర్యం, ఆవిష్కరణ, పోటీతత్వం బాగా పెరిగాయని ఆయన అన్నారు. ఈ మినీరత్న హోదా సామర్థ్య విస్తరణ, ఆధునికీకరణ, ప్రభుత్వ, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఉమ్మడి పరిశ్రమలు, విలీనాలతో సహా కొత్త సంస్థలు, సహకారాలను అన్వేషించడంలో ఈ నాలుగు డీపీఎస్‌యూలకు సాధికారత ఇస్తుందని వివరించారు.

ఈ రంగం కనబరుస్తున్న అద్భుతమైన పనితీరును వివరిస్తూ.. 2024-25లో రూ.1.51 లక్షల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తిని సాధించిందని, దీనిలో డీపీఎస్‌యూల వాటా 71.6 శాతంగాఉందని శ్రీ రాజనాథ్ సింగ్ వెల్లడించారు. రక్షణ రంగ ఉత్పత్తులు రూ.6,695 కోట్లను చేరుకున్నాయని, ఇది భారత్ అభివృద్ధి చేసిన ఆయుధాలపై ప్రపంచ విశ్వాసాన్ని తెలియజేస్తున్నాయన్నారు. "ఇది 'మేడిన్ ఇండియా' రక్షణ ఉత్పత్తులు అంతర్జాతీయంగా గుర్తింపు సాధిస్తున్నాయని స్పష్టంగా తెలియజేస్తుంది" అని తెలిపారు.

ఈ వేగాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ.. కీలకమైన సాంకేతికతలను త్వరితగతిన దేశీయంగా అభివృద్ధి చేయడం, సమగ్ర పరిశోధనాభివృద్ధికి, ఉత్పత్తి నాణ్యతను మెరుగు పరచడం, సమయానికి సరఫరా చేయడం, ఎగుమతులను పెంచడానికి వ్యూహాత్మక విధానాన్ని అనుసరించడంపై దృష్టి సారించాలని డీపీఎస్‌యూలను రక్షణ మంత్రి కోరారు. తదుపరి సమీక్షలో స్వదేశీకరణను స్పష్టంగా నిర్వచించాలని, అంచనా వేయగల విజయాలతో ఆర్ అండ్ డీ ప్రణాళికలను సమర్పించాలని డీపీఎస్‌యూలను ఆదేశించారు. "అవసరమైన చోట ప్రత్యేక జోక్యం లేదా సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇస్తున్నాను" అని తెలిపారు.

సహకార, స్వావలంబన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ.. డీపీఎస్‌యూల మధ్య మూడు అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. యంత్ర ఇండియా లిమిటెడ్ (వైఐఎల్) ఆధునికీకరణ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో ఉపయోగించే అల్యూమినియం మిశ్ర ధాతువుల దిగుమతులను తగ్గించడంలో కీలకంగా వ్యవహరించే 10,000 టన్నుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆ సంస్థతో హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వైఐఎల్‌కు రూ.435 కోట్ల వడ్డీ రహిత అడ్వాన్సులను అందించేందుకు హెచ్ఏఎల్ కట్టుబడి ఉంది. అలాగే పదేళ్ల పాటు 3,000 మెట్రిక్ టన్నుల వరకు పనిని బీడీఎల్ అందిస్తుంది. జాతీయ ప్రాధాన్యమున్న రక్షణ ప్రాజెక్టులకు అవసరమైన కీలక ముడి ఖనిజాలను ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉంచేలా.. మిధానిలో మెటల్ బ్యాంకును ఏర్పాటు చేయడానికి మూడో ఒప్పందం కుదిరింది.

డిజిటైజేషన్, మేధో సంపత్తి రూపకల్పన, భారతీయ విద్యాసంస్థలతో సహకారం ద్వారా ఆర్ అండ్ డీ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించిన ఆర్ అండ్ డీ మాన్యువల్‌తో సహా వివిధ పరిశోధనాభివృద్ధి కార్యక్రమాలను రక్షణ మంత్రి ఆవిష్కరించారు. కొనసాగుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు వ్యూహాలను డీపీఎస్‌యూల ఆర్ అండ్ డీ రోడ్ మ్యాప్ ఏకీకృతం చేస్తుంది. ఇది లైసెన్స్ ఆధారిత ఉత్పత్తి నుంచి దేశీయంగా రూపకల్పన, అభివృద్ధి వరకు రక్షణ సాంకేతిక రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా వేసిన నిర్ణయాత్మక అడుగును సూచిస్తుంది.

రక్షణ ఉత్పత్తుల తయారీలో సుస్థిరత దిశగా సాగిస్తున్న ప్రయాణంలో భాగంగా.. స్వయం - స్థిరమైన, పర్యావరణహిత రక్షణ ఉత్పత్తుల తయారీని శ్రీ రాజనాథ్ సింగ్ ప్రారంభించారు. ఇది డీపీఎస్‌యూల్లో హరిత విధానాలను తీసుకొచ్చే సమగ్ర కార్యక్రమం. సమగ్ర ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళిక (సీఈఈఏపీ) 2023లో భాగమైన రక్షణ ఉత్పత్తుల రంగంలో ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పునరుత్పాదక ఇంధన స్వీకరణను విస్తరించడానికి, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి చేసే ప్రయత్నాలను స్వయం వివరిస్తుంది. స్వర్ణ డ్యాష్ బోర్డు, డీపీఎస్‌యూ ఇంధన సామర్థ్య సూచీ లాంటి డిజిటల్ పరికరాల సాయంతో.. సుస్థిరత, స్వావలంబనను మిళితం చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేస్తుంది.

100 శాతం హరిత ఇంధన వినియోగాన్ని సాధించిన ఐవోఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)ను రక్షణ మంత్రి అభినందించారు. 2025 సెప్టెంబర్ నుంచి పూర్తిగా పునరుత్పాదక ఇంధనాన్ని ఐవోఎల్ వినియోగిస్తోంది. తద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 8,669 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించి, రూ. 26.36 లక్షలను ఆదా చేసింది. 2025 జనవరిలో ఆర్ఈ 100 లక్ష్యాన్ని సాధించిన మొదటి సంస్థగా నవరత్న డీపీఎస్‌యూ అయిన బీఈఎల్ నిలిచింది. తన స్కోప్-2 ఉద్గారాలను 15,000 టన్నుల నుంచి శూన్యానికి తీసుకొచ్చి సున్నా కర్బన ఉద్గారాల లక్ష్యాల దిశగా గణనీయమైన విజయాన్ని సాధించింది.

భారత రక్షణ తయారీ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో డీపీఎస్‌యూల నాయకత్వం, ఆవిష్కరణ, అంకితభావాన్ని శ్రీ రాజనాథ్ సింగ్ ప్రశంసించారు. "రక్షణ ఉత్పత్తుల్లో భారత్ స్వావలంబన సాధించేలా చేయడమే కాకుండా.. అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మార్చే సంకల్పం తీసుకుందాం" అని ఆయన అన్నారు. జాతీయ భద్రత, ఆర్థిక వృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న అన్ని డీపీఎస్‌యూలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్, సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ నాయకత్వంలో అత్యాధునిక వసతులతో నూతన డీపీఎస్‌యూ భవన్ రూపుదిద్దుకుంది. రక్షణ ఉత్పత్తుల విభాగం అభివృద్ధి చేసిన ఈ భవనం 'సంగచ్ఛధ్వం సంవదధ్వం' (కలిసి నడుద్దాం.. కలిసి చర్చిద్దాం) అనే నినాదంతో మొత్తం 16 డీపీఎస్‌యూల్లో సహకారాన్ని, ఆవిష్కరణను, సమష్టి కార్యకలాపాలను ప్రోత్సహించే ఉమ్మడి వేదికగా పనిచేస్తుంది. ఆధునిక కాన్ఫరెన్స్ రూములు, సిమ్యులేషన్ సౌకర్యాలు, ఎగ్జిబిషన్ ప్రాంతంతో కూడిన ఈ భవనం.. డీపీఎస్‌యూల సామర్థ్యాన్ని ఏకీకృతం చేయడానికి, భారత రక్షణ తయారీ సామర్థ్యాలను దేశీయ, అంతర్జాతీయ భాగస్వామ్యులకు ప్రదర్శించడానికి సహకరిస్తుంది.

రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, కార్యదర్శి (రక్షణ ఉత్పత్తి) శ్రీ సంజీవ్ కుమార్, అన్ని డీపీఎస్‌యూల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారత్ ను "వాటర్‌స్ట్రెస్‌డ్ నేషన్" నుంచి "వాటర్‌సెక్యూర్ నేషన్"గా మలచడమే లక్ష్యం

న్యూఢిల్లీ, నవంబర్ 11:ప్రపంచ పునరుత్పాదక జల వనరుల్లో భారతదేశం వాటా కేవలం 4% మాత్రమే అయినా, ప్రపంచ జనాభాలోని 18% మందికి నీటి అవసరాలను తీర్చాల్సి వస్తుందని, అందుకే, ప్రతీ నీటి చుక్కని జాగ్రత్తగా సంరక్షించాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

గుంటూరులో నిర్వహిస్తున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి, నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశ వార్షిక వర్షపాతంలో మూడు వంతు కేవలం జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల్లోనే పడుతుందని, ఆ సమయంలోనే ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా ఒడిసి పట్టి, నిల్వ చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జాతీయ వాటర్ షెడ్ సదస్సు తన సొంత నియోజకవర్గంలో జరగడం తనకెంతో గర్వంగా, సంతోషంగా ఉందన్న మంత్రి, వాటర్‌షెడ్ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయడానికి కృషి చేస్తున్న మేధావులు, గ్రామీణ స్థాయి యోధులను ఈ కార్యక్రమం ఒకే చోటకు తీసుకువస్తుందన్నారు. మన దేశ చరిత్ర ఎప్పుడూ వర్షకాలంతో ముడిపడి ఉందని, వర్షాలు సమృద్ధిగా పడితే సుభిక్షం, లేదంటే కరవు, కష్టాలే మన చరిత్ర అన్నారు. రానురాను నీటి కొరత పెరుగుతోందన్న మంత్రి.. 2021లో తలసరి నీటి లభ్యత 1,486 మీటర్ క్యూబిక్ కాగా, 2031 నాటికి 1,367 మీటర్ క్యూబిక్ కు పడిపోతుందని, ఇది "నీటి ఒత్తిడి పరిధి"లోకి వస్తుందని వివరించారు. ఉగ్రవాదానికి జీరో టోలరెన్స్ లాగానే, నీటి వ్యర్థానికి కూడా జీరో టోలరెన్స్ అవసరమని అన్నారు. ప్రపంచంలోని నీటి వనరుల్లో భారత్ వద్ద కేవలం 4% మాత్రమే ఉన్నాయని, కానీ మనం ప్రపంచ జనాభాలో 18% వాటా కలిగిన దేశ జనాభా అవసరాల్ని తీర్చాల్సి వస్తుందని అన్నారు. ఈ ఒత్తిడి కారణంగా 2016లో సంభవించిన కరవు కారణంగా దాదాపు 33 కోట్ల మంది ప్రభావితం అయ్యారని గుర్తు చేశారు.

అసమర్థమైన వాటర్‌షెడ్ నిర్వహణ వల్ల వర్షకాలంలో వరదలు, ఎండాకాలంలో కరువులు పెరుగుతాయన్న మంత్రి పెమ్మసాని, మట్టి ధ్వంసం వేగవంతమవుతుందని, రైతుల ఆదాయం తగ్గుతుందని, పట్టణాల్లో నీటి సంక్షోభం తీవ్రమవుతుందని వివరించారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ తరచూ చెప్పే "నీటి భద్రతే-జాతీయ భద్రత" అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకునే డబ్ల్యూడీసీ-పీఎంకెఎస్‌వై (వాటర్‌షెడ్ డెవలప్మెంట్ కంపోనెంట్ ? ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన) ద్వారా ప్రభుత్వంల నీటి సంరక్షణ చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

తొలి విడుత చేపట్టిన కార్యక్రమాల వల్ల వార్షిక వ్యవసాయ ఆదాయం రూ.19,454 కోట్లు పెరిగి, పెట్టుబడి కంటే 6.2 రెట్లు ఎక్కువ లాభాలు లభించాయని మంత్రి పెమ్మసాని తెలిపారు. రైతుల ఆదాయం 70% పెరిగిందని, పాల ఉత్పత్తి 40% పెరిగిందని వివరించారు. ప్రభుత్వం కార్యక్రమాల కారణంగా భూగర్భ జలస్థాయిలు 3 మీటర్ల మేర పెరిగాయని, నేల తేమ శాతం కూడా మెరుగుపడిందని వివరించారు. ఈ కారణంగానే.. చాలా చోట్ల రెండు, మూడో పంటలు కూడా సాధ్యమయ్యాయన్నారు. సాగు నీటితో పాటు తాగునీటి వనరులు సైతం పటిష్టమయ్యాయన్నారు.

డబ్ల్యూడీసీ-పీఎంకెఎస్‌వై 2.0 - లక్ష్యాలు

ప్రస్తుతం 50 లక్షల హెక్టార్లలో 1,220 ప్రాజెక్టులను రూ.12,972 కోట్ల వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, 2026 నాటికి కరువు ప్రభావిత, వర్షాధార ప్రాంతాలను పునరుద్ధరించడం లక్ష్యమని చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించిన "వాటర్‌షెడ్ యాత్ర" ఇప్పటికే 8.5 లక్షల రైతులను చేరుకుందని, సమాజం ముందుకు వస్తే, మార్పు ఖచ్చితంగా జరుగుతుందని దీని ద్వారా నిరూపితమైందని మంత్రి అన్నారు. గుంటూరులో రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమంలో "విజయాలను పంచుకుందాం, సవాళ్లను ఎదుర్కుందాం, కలిసి పరిష్కారాలను రూపొందిద్దాం" అని పిలుపునిచ్చారు.

డబ్ల్యూడీసీ-పీఎంకెఎస్‌వై 2.0 కార్యక్రమాల్ని సమీక్షించి, పనుల్ని వేగవంతం చేసి, ఫలితాలు సాధించాలని రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహక అధికారులకు సూచించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్, మిషన్ వాటర్‌షెడ్ పునరుత్థాన్ వంటి కార్యక్రమాలు గేమ్-చేంజర్లుగా నిలుస్తాయని, వాటిలో లైన్ డిపార్ట్‌మెంట్‌లు, పంచాయతీలు, సమాజాన్ని, ప్రైవేట్ భాగస్వాములు సహా అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం అమలు చేయడం మాత్రమే కాదని, స్థిరంగా కొనసాగించడం చాలా ముఖ్యమన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులను పునరుద్ధరించి, గ్రామీణాభివృద్ధికి సరికొత్త రూపు,ఉత్సాహం అందిస్తున్నారని ప్రశంసించారు. నూతన రాజధాని అమరావతిలో భవనాల నిర్మాణం ప్రారంభమయ్యే ముందే నీటి వనరులు నిర్మించడం ద్వారా నీటి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ దిశానిర్దేశంలో తదుపరి దశ చిఆఅ?ఖఓఖూజ 3.0 కార్యక్రమంలో ఆధునిక విజ్ఞానం, సాంకేతికతను వినియోగించడంతో పాటు నదుల పునరుజ్జీవనం, సాంప్రదాయ నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ,ప్రాజెక్టు సరిహద్దుల దాటి ప్రయోజనాల్ని విస్తరించడం వంటి లక్ష్యాల్ని ఏర్పరుచుకోనున్నట్లు తెలిపారు. అందుకోసం విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు, నిపుణులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు అందరూ కలిసి డబ్ల్యూ డీసీ-పీఎంకెఎస్‌వై 3.0కు సూచనలు, సలహాలు అందించాలని ఆహ్వానించారు.

కేంద్ర ప్రభుత్వం నిధులు, సాంకేతిక సహాయం, సవరించిన మార్గదర్శకాలతో సిద్ధంగా ఉందన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో, ప్రజా భాగస్వామ్యంతో, దీర్ఘకాల కట్టుబాటుతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వాటర్‌షెడ్ అభివృద్ధి అంటే కేవలం చెక్ డ్యామ్‌లు నిర్మించడం కాదని, అది గ్రామీణ భారత పర్యావరణ మూలాన్ని పునర్నిర్మించడం, అనిశ్చిత వాతావరణంలో స్థిరత్వం సృష్టించడం, వర్షపు నీటిని వరద అనే ప్రమాదం నుంచి, భూగర్భజల మట్టాలు పెంచడం, భూమి తేమ రూపంలో ఆస్తిగా మార్చించడమని అన్నారు.

# పేదలకు అండగా ప్రభుత్వం .

హైదరాబాద్, నవంబర్ 11:పేదలకు అండగా ప్రభుత్వం ఉందని జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస అన్నారు. ఈ రోజు స్థానిక రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి మహిళకు పెండ్లి భారం కావద్దని, ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ లబ్దిదారులను మరచిపోవడం లేదన్నారు.

ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని వివరించారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నేతృత్వంలో అన్ని వర్గాల లబ్దిదారులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మాది పేదల ప్రభుత్వం అని, మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని చూపుతున్నామని వివరించారు.

అనంతరం పలువురు లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్,



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేల రాజు, తహసీల్దార్ దిలీప్ కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విదేశీ విద్యార్థులకు అమెరికాలో ఎలాంటి అడ్డంకులు లేవు : డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, నవంబర్ 11: విదేశాలకు చెందిన విద్యార్థులు అమెరికా లో చదువుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. విదేశీ విద్యార్థులు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇది దేశ ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'విదేశాల నుంచి అమెరికాకు వస్తోన్న విద్యార్థుల సంఖ్యను సగానికి తగ్గించకూడదు. దానివల్ల మన విశ్వవిద్యాలయ, కళాశాల వ్యవస్థ నాశనమవుతుంది. నేను అలా జరగనివ్వను. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు ఉండటం మంచిది. నేను ప్రపంచంతో కలిసి ఉండాలని అనుకుంటున్న' అని వ్యాఖ్యానించారు. అమెరికాకు వచ్చేవారిని సగానికి తగ్గిస్తే కొంతమందికి సంతోషాన్ని ఇస్తుందని, అయితే దేశంలోని సగం కళాశాలలకు వ్యాపారం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. దేశీయ విద్యార్థులతో పోలిస్తే విదేశాల నుంచి వచ్చేవారు రెట్టింపు కంటే ఎక్కువ చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీసుకుంటున్న నిర్ణయాలకు, ప్రస్తుతం ఆయన మాట్లాడిన మాటలకు ఎలాంటి పొంతన లేదు.

# రాజాపేటలో ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నల్గొండ, నవంబర్ 11: రాజాపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకట రమణారెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పాముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బొందుగుల రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ, ఏఈఓలు ప్రణీత, అంజయ్య వినీత, భవిత పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులంలో జాతీయ విద్యా దినోత్సవం



హనుమకొండ, నవంబర్ 11: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల(వరంగల్ బాలికలు-1)లో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ ప్రొఫెసర్ ముస్తఫా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఖవ్వాలి అందరినీ ఆకర్షించింది. ఖురాన్ పూర్తిచేసిన విద్యార్థులకు సన్మానం చేశారు. పూర్వవిద్యార్థులు అతియా తరన్నుమ్, హదస్సా, వర్ష లాంటి ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ దాసరి క్రిష్ణకుమారి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన

నల్గొండ, నవంబర్ 11: రాజాపేట మండలంలోని నేమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల పశు వైద్యాధికారి చంద్రారెడ్డి విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుక్క కాటు వేస్తే రేబిస్ వ్యాధి రాకుండా పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ప్రతి సంవత్సరం తప్పకుండా ఇప్పించాలన్నారు. కుక్క కాటు వేసిన 20 నిమిషాల లోపు గాయాన్ని నీటితో, డెటాల్ ద్రావణంతో శుభ్రంగా కడిగి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి, వైద్యుల సలహా మేరకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మన్నెం శ్రీనివాసరెడ్డి, పశు వైద్య సిబ్బంది టీ.శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వీబీవైఎల్డీ- 2026లో రికార్డు స్థాయి భాగస్వామ్యం..

## అమృత తరం కోసం ప్రధాని మోదీ దార్శనిక చర్యల ఫలితం

న్యూఢిల్లీ, నవంబర్ 11:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ 'మేరా యువ భారత్ (మై భారత్)' ద్వారా ఆ శాఖ నిర్వహిస్తున్న ప్రతిష్మాత్మక కార్యక్రమం వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ).. దేశ వికాసంలో క్రియాశీల భాగస్వాములుగా నిలిచేలా భారత యువతకు స్ఫూర్తినిస్తోంది. 2026 ఎడిషన్ ఈ ఏడాది మొదట్లో విజయవంతంగా ప్రారంభమైంది. కార్యక్రమ మొదటి దశకు దేశవ్యాప్తంగా అద్భుత స్పందన లభించింది.

మై భారత్, మై గవ్ వేదికలు 2025 సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 31 సంయుక్తంగా వీబీవైఎల్డీ- 2026 క్విజ్ పోటీలు నిర్వహించగా.. గత ఎడిషనులో 30 లక్షల మంది పాల్గొన్న రికార్డును అధిగమిస్తూ, ఈ దఫా 50.42 లక్షలకు పైగా యువత ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. మొత్తం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వికసిత భారత్ఏ2047 లక్ష్యం దిశగా వారి ఉత్సాహాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

ఈ కార్యక్రమంలో పురుషులు, మహిళలు దాదాపు సమానంగా భాగస్వాములయ్యారు. 51 శాతం పురుషులు, 49 శాతం మహిళలు ఇందులో పాల్గొన్నారు. అత్యధిక సంఖ్యలో భాగస్వాములతో తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, పశ్చిమ బెంగాల్ మొదటి అయిదు స్థానాల్లో నిలిచాయి. పాలన, విధాన రూపకల్పనలతోపాటు వికసిత్ భారత్ దిశగా దేశ అభివృద్ధి ప్రస్థానంలో అర్థవంతంగా తోడ్పాటు అందించాలన్న ఆకాంక్ష దేశ యువతలో పెరుగుతోందనడానికి ఈ విశిష్ట కార్యక్రమం నిదర్శనం.

అనంతరం వీబీవైఎల్‌డీ-2026 రెండో దశలో అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి రూపుదిద్దే పది కీలక జాతీయ ఇతివృత్తాలపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. దీనిద్వారా దాదాపు 2.56 లక్షల మంది యువతను ఎంపిక చేసి తమ అభిప్రాయాలను పంచుకోవడానికి ఆహ్వానిస్తారు:

22 భారతీయ భాషల్లో ఎందులోనైనా వ్యాసాలను రాయొచ్చు. 2025 నవంబరు 20 వరకు వీటిని స్వీకరిస్తారు.

న్యాయబద్ధంగా, పారదర్శకంగా మూల్యాంకన ప్రక్రియ నిర్వహించడం కోసం అన్ని రాష్ట్రాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో వ్యాసాలను సమీక్షించి, ప్రతిభావంతులైన యువ భాగస్వాములను రాష్ట్ర స్థాయి రౌండ్లకు ఎంపిక చేస్తారు. అక్కడ వికసిత భారత్ కోసం తమ ఆలోచనలను ప్రదర్శనల ద్వారా అందరితో పంచుకుంటారు.

దేశ యువత ఆలోచనల్లో వైవిధ్యాన్ని వెల్లడి చేయడం మాత్రమే కాదు... రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువతను ప్రజా జీవితంలోకి వచ్చేలా ప్రోత్సహించాలంటూ 2023 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపును ఈ పోటీలు మరింత ముందుకు తీసుకెళ్తాయి. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) నేడు మార్పును కాంక్షించే యువత దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జనభాగీదారి, యువశక్తి దార్శనికతలకు అనుగుణంగా.. పాలనలో భాగస్వాములయ్యేందుకు, వినూత్న ఆలోచనలను పంచుకునేందుకు, దేశాభివృద్ధికి అర్థవంతంగా దోహదపడేందుకు క్రియాశీల వేదికగా ఇది నిలుస్తుంది.

# పాడి పశువుల గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు

## – పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ వెంకటయ్య



మెదక్, నవంబర్ 11: మెదక్ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 1,52,534 పాడి, పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ వెంకటయ్య పేర్కొన్నారు. అందులో భాగంగా మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో మంగళవారం జాతీయ పశువైద్య నియంత్రణ పథకంలో భాగంగా కుసంగి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

ఈ కార్యక్రమం జిల్లాలో నవంబర్ 14వరకు కొనసాగుతుందని తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువులలో వచ్చే అంటువ్యాధి అని, ఈ వ్యాధి వచ్చిన పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, అలాగే ఉత్పాదక శక్తి సైతం తగ్గిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. 3 నెలల పైబడిన పశువులకు, చూడి పశువులకు కూడా కచ్చితంగా టీకాలు ఇప్పించాలని తెలిపారు.

వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే నివారణే ముఖ్యమన్నారు. కాబట్టి పశు పోషకులు కచ్చితంగా తమ పశువులకు టీకాలు ఇప్పించాలని సూచించారు. మేలు జాతి పశు సంపద అభివృద్ధి, పశు గ్రాసం సాగు ప్రాముఖ్యత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్త, పశుపాకల పరిశుభ్రత, దూడలలో నట్టల నివారణ వంటి విషయాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారులు నాగరాజు, సౌమ్య, నాగార్జున పాటిల్, ప్రవీణ్, నిస్సీ జాయిస్, జూనియర్ వెటర్నరి అధికారులు హన్మంతు, సతీష్ కుమార్, సిబ్బంది కృష్ణ, పరమయ్య, గోపాలమిత్ర రవి తదితరులు ఉన్నారు.

# బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ధర్మ పోరాట దీక్షలు

## – బీసీల ధర్మ పోరాట దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి




హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని బీసీ జేఏసీ ఇచ్చిన అష్టాంగ ఆందోళన కార్యక్రమాలలో భాగంగా (నవంబర్) ఈనెల 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా నియోజకవర్గ మండల కేంద్రాలలో వేలాధీ మందితో బీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న బీసీల ధర్మ పోరాట దీక్షలను విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు హైదరాబాదులోని కాచిగూడ లో ఉన్న అభినంద్ గ్రాండ్ హోటల్ లో బీసీ జేఏసీ చీఫ్ ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, డిసెంబర్ ఒకటవ తేదీ నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో సమన్వయం చేసుకుని పార్లమెంటును స్తంభింపచేయాలని, కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేదాకా పార్లమెంటు సమావేశాలు వేదికగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీల తరపున రాజకీయ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం అధ్యక్షులు ఎం వీరస్వామి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏం చంద్రశేఖర్ గౌడ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు నందగోపాల్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లాల నరసింహ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, ముదిరాజ్ ఐక్యవేదిక కన్వీనర్ గౌడుగు మల్లికార్జున్, మన బీసీ మహాసభ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, దాసరి ఉష, తారకేశ్వరి, సమతా యాదవ్, సుజాత, ఉదయనేత, లచ్చు గౌడ్, స్వామి వివేక్ పటేల్, జ్ఞానేశ్వర్, కాచి సంఘం నేత హరి తిలక్ సింగ్, సత్యరాజ్ గౌడ్, శివమ్మ, నరసింహ చారి, సతీష్ నేత, వేణు, సాయిని యాదగిరి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలన్నదే తమ లక్ష్యం

## -చదువుకుంటున్న విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోపు స్థానికంగా ఉపాధి

## -స్పష్టం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ప్రకాశం నవంబర్ 11 (ఎక్స్ ప్రెన్ న్యూ న్);ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలన్నదే తమ లక్ష్యమని, చదువుకుంటున్న విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోపు స్థానికంగా ఉపాధి కల్పిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఇవాళ చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే ఛీఛీ అనేవాళ్లు.. ఇప్పుడు భలే భలే అంటున్నారని అని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గూగుల్ వంటి సంస్థలు ఏపీకి వస్తున్నాయని.. చదువుకున్న పిల్లలు ఒకప్పుడు అమెరికా వెళ్లేవాళ్లని.. ఇప్పుడు ఇక్కడే వ్యాపారాలు చేయాలనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్, నేను కలిసి కూటమి ఏర్పాటు చేశామని తెలిపారు. దీనివల్ల కేంద్రం తీసుకొచ్చే పాలసీలను నేరుగా రాష్ట్రానికి తీసుకొస్తున్నానని పేర్కొన్నారు. ఇందుకోసం పవన్ కల్యాణ్ బాగా మద్దతు ఇస్తున్నారని.. లోకేశ్ కూడా పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నాడని చెప్పారు. ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలన్నదే తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. చదువుకుంటున్న విద్యార్థులకు చదువు పూర్తయ్యేలోపు స్థానికంగా ఉపాధి కల్పించే బాధ్యత తనది అని స్పష్టం చేశారు. 1987 ప్రాంతాల్లో అందరికీ ఉద్యోగాలు ఇస్తామని కొంతమంది రాజకీయ నేతలు చెప్పేవారని.. కానీ తాను మాత్రం ఇంటికొక వ్యాపారవేత్తను తయారుచేస్తానని హామీ ఇచ్చానని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నామని పేర్కొన్నారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని అన్నారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసేకోవాలని సూచించారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చామని.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తున్నామని అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు అంటే చాలామంది అవహేళన చేశారని.. కానీ ఏపీలో



పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకొచ్చాయని తెలిపారు. ఈ వారమంతా పెట్టుబడుల వెల్లువ కొనసాగుతుందని చెప్పారు. పెట్టుబడులతో ఉద్యోగవకాశాలు పెరుగుతాయని అన్నారు. గత వైసీపీ పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారని చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్ హయాంలో విధ్వంస విధానాలతో పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చడంతో విధ్వంసం రాష్ట్రవ్యాప్తంగా జరిగిందని అన్నారు. 17 నెలల నుంచి భిన్నమైన పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏపీలో పనిచేస్తుందని తెలిపారు. చాలా సుడిగుండాల నడుమ తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తు టెక్నాలజీది అని.. 35 ఏళ్ల క్రితం తాను చెబితే అంతా అవహేళన చేశారని అన్నారు. కానీ 25 ఏళ్ల క్రితం తాను అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తే హైదరాబాద్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఇప్పుడు ఏపీ అభివృద్ధి కోసం అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్స్ తీసుకొచ్చామని తెలిపారు. ఇది వచ్చే జనవరిలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జపాన్, అమెరికా సరసన మనం చేరబోతున్నామని వ్యాఖ్యానించారు.

# సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలి

## –ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్



అమరావతి నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సెక్యులరిజం రెండు మార్గాల్లో ఉంటుందని, మత విశ్వాసాల రక్షణ, గౌరవం అంశంలో రాజీ ఉండదని ఆయన అన్నారు. మన సనాతన ధర్మం అత్యంత ప్రాచీనమైందని, నాగరికతతో ఆ ధర్మం వర్ధిల్లుతున్నదని, ఇలాంటి సమయాల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఎక్స్ అకౌంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇవాళ ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం కోసం ఆ బోర్డు ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదు అని, అది పవిత్ర ఆధ్యాత్మిక యాత్రకు కేంద్రమని, తిరుపతి లడ్డూ కేవలం స్వీటు మాత్రమే కాదు అని, అదొక భావోద్వేగం అన్నారు. మన స్నేహితులు, కుటుంబీకులు, దగ్గరవారికి ఆ లడ్డూను ఎంతో ప్రేమతో పంచిపెడుతామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మనలో ఉన్న సామూహిక నమ్మకానికి, విశ్వాసాన్ని చాటుతుందన్నారు. ప్రతి ఏడాది సగటును 2. 5 కోట్ల మంది భక్తుల తిరుమలను దర్శించుకుంటారని, సనాతన విధానాలు అవలంబిస్తున్న వారి మనోభావాలను దెబ్బతీయాలని చూసినా, లేక హేళన చేసినా, అది కేవలం బాధను మాత్రమే కలిగించదు అని, లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో తిరుపతి లడ్డూపై ఓ పత్రిక రాసిన కథనాన్ని రీపోస్టు చేశారు. టీటీడీ లడ్డూ తయారీ కోసం ఉత్తరాఖండ్‌కు చెందిన డెయిరీ సంస్థ నెయ్యి సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఒక్క పాలచుక్కను కూడా సేకరించని ఆ సంస్థ ఎలా 68 లక్షల కేజీ నెయ్యిని సరఫరా చేసిందని కథనంలో ప్రశ్నించారు. 2019 నుంచి 2024 వరకు ఆ డెయిరీ సంస్థ సుమారు 250 కోట్ల ఖరీదైన నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# తిరుచానూరు పద్మావతీ అమ్మవారి వార్షిక కార్తిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి వార్షిక కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6.00 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు.

అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ప్రతినిధులు అమ్మవారి ఆలయంలో మంగళవారం 7 పరదాలను, తిరుపతికి చెందిన మణి 3 పరదాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబు స్వామికి దాతలు అందజేశారు.

# తాళాలు వేసిన ఇండ్లకే కన్నాలు




హుజూర్‌నగర్, నవంబర్ 11: తాళాలు వేసిన ఇండ్లే టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఆంధ్రా రాష్ట్రానిక చెందిన వ్యక్తిని ఈ రోజు హుజూర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చరమందరాజు కేసు వివరాలు తెలుపుతూ? హుజూర్ నగర్ మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో ఈ నెల 5న తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇంట్లో ఉన్న బీరువాలో దాచిన బంగారు ఆభరణాలు, 90 వేల నగదు దొంగించబడ్డాయని బాధితుడు ముడెం గోపిరెడఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోపిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్ళగా అది గమనించిన మల్లికార్జున్ రెడ్డి (ఆంధ్ర రాష్ట్రం కృష్ణా జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామం) తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన బంగారు ఆభరణాలు 90 వేల రూపాయల నగదును దొంగించుకు పోయాడు.

దొంగిలించిన బంగారాన్నీ కరగపోయించి మిర్యాలగూడెంలో అమ్మడానికి వెలుచుండగా హుజూర్ నగర్ ఎస్ఐ మోహన్ బాబు ఈ రోజు వాహనాలు తనిఖీలు చేస్తుండగా నిందితుడు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు.

నేరస్తుడు బి టెక్ చదివి ఉద్యోగం రాకపోవడంతో జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పడుతున్నాడని గతంలో ఈ వ్యక్తి పై కేసులు నమోదు అయినట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి 5 తులాల 14 గ్రాముల బంగారం, 90 వేల నగదు, ఒక బైక్, సెల్ పోం స్వాధీనం చేసుకునామన్నారు.

సీసీ కెమెరాల పుటేజీ సహాయంతో కేసును త్వరిత గతిన ఛేదించిన ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది నాగరాజు శంభయ్య, వీరప్రసాద్ వెంకటేశ్వర్లులను అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ మోహన్ బాబు పోలీస్ సిబ్బంది నాగరాజు శంభయ్య వీరప్రసాద్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

